మసకబారిన చదువుల కోవెల

1973లో విశ్వోదయ నిర్వహణలో పీజీ కళాశాల ప్రారంభం

- 1978లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి అప్పగింత
- 2011లో వీఎస్‌యూకు బదిలీ
- గతంలో ఆర్ట్స్ గ్రూపుల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ
- ప్రస్తుతం ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులపై మక్కువ
- ఆర్ట్స్ సబ్జెక్ట్‌ల్లో చేరే వారు లేక వెలవెల

కావలి: పట్టణంలో పీజీ కోర్సులు అందిస్తున్న విక్రమసింహపురి యూనివర్సిటీ కళాశాల ప్రతిష్ఠ క్రమంగా మసకబారుతోంది. గతంలో ఆర్ట్స్ సబ్జెక్ట్‌ల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడే వారు. దీంతో కళాశాల విద్యార్థులతో కళకళలాడుతుండేది. ప్రస్తుతం ఇంజనీరింగ్, మెడిసిన్ కోర్సులపై విద్యార్థులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ఆర్ట్స్ సబ్జెక్ట్‌ల్లో చేరేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో కళాశాల వెలవెలబోతోంది.

53 ఏళ్ల క్రితం ప్రారంభం

పట్టణంలో విశ్వోదయ విద్యా సంస్థల ఆధ్వర్యంలో విశ్వోదయ హైస్కూల్, జవహర్ భారతి ఇంటర్, డిగ్రీ కళాశాలలు విజయవంతంగా కొనసాగుతున్న రోజుల్లో పీజీ చదివేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విశ్వోదయ విద్యా సంస్థల నిర్వహణలో 1972లో పీజీ కళాశాలను ఎంఏ ఆర్థిక శాస్త్రం సబ్జెక్ట్‌తో ప్రారంభించారు. 1973లో కామర్స్ సబ్జెక్ట్‌ను కూడా మొదలు పెట్టారు. 1978లో తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అప్పగించారు. 1979లో ఎస్వీ వర్సిటీ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా కావలి పీజీ కళాశాలను పూర్తిస్థాయి పీజీ సెంటర్‌గా గుర్తించింది. ఫిజిక్స్, జువాలజీ సబ్జెక్టులను ప్రారంభించారు. 1984లో పట్టణంలోని పెద్ద పవని రోడ్డులో 78.9 ఎకరాలను ప్రభుత్వం మంజూరు చేసి పీజీ సెంటర్ క్యాంపస్‌కు గుర్తింపు తీసుకొచ్చింది. 2011లో విక్రమ సింహపురి వర్సిటీకి కళాశాలను బదలాయించారు. 2021లో కావలి పీజీ సెంటర్‌ను విక్రమ సింహపురి వర్సిటీ కళాశాలగా పేరు మార్చారు.





విశిష్టమైన స్థానం

పీజీసెంటర్‌లో చదివిన విద్యార్థులు ఎంతో మంది మంచి ర్యాంకులతో పాటు బంగారు పతకాలను సాధించారు. ప్రభుత్వ సేవలతో పాటు విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. పీజీ కళాశాలలో అద్భుతమైన అకడమిక్ యాక్టివిటీతో పాటు మంచి పరిశోధన అవుట్‌పుట్ కూడా ఉంది. దేశంలోని సుప్రసిద్ధ సంస్థలతో అనేక పరిశోధన ప్రాజెక్టులు నిర్వహించబడ్డాయి. జాతీయ సంస్థలు, కొన్ని ప్రభుత్వాల సహకారంతో కూడా పరిశోధనలు జరిగాయి. జాతీయ, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన జర్నల్స్‌లో 35 కంటే ఎక్కువ పుస్తకాలు, 700 పరిశోధనా వ్యాసాలు పీజీ సెంటర్ అధ్యాపకుల విశిష్ట సహకారం. దాదాపు 15కుపైగా జాతీయ సెమినార్లు నిర్వహించడం జరిగింది. విద్యార్థుల కోసం లైబ్రేరీలో పుస్తకాలు 31,566, జర్నల్స్ 67, మ్యాగజైన్లు 24 ఉన్నాయి. రెండు కంప్యూటర్ ల్యాబ్‌లు సైతం ఉన్నాయి. ఫిజిక్స్, జువాలజీ, బొటనీ ల్యాబ్‌లు కూడా అధునాతన రంగాల్లో అవసరమైన పరికరాలతో ఏర్పాటై ఉన్నాయి. రెండు సెమినార్ హాళ్లు ఉన్నాయి. పురుషులు, మహిళలకు విశాలమైన వసతిగృహాలు ఉన్నాయి.

సగం సీట్లు కూడా భర్తీ కాని పరిస్థితి

విక్రమ సింహపురి వర్సిటీ కళాశాలలో మొత్తం 8 సబ్జెక్టులు ఉన్నాయి. ఎంసీఏ సబ్జెక్టులో 60 సీట్లు ఉండగా, మిగిలిన ఎంబీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్, కామర్స్, ఎకనామిక్స్, జువాలజీ, బొటనీ, మ్యాథ్స్, తదితర సబ్జెక్ట్‌లలో 30 చొప్పున సీట్లు ఉన్నాయి. కాగా ఇటీవల కాలంలో ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులపై మక్కువతో ఆర్ట్స్‌లో పీజీ చేసే విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఎకనామిక్స్, కామర్స్ కోర్సుల్లో 8 మంది మాత్రమే విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మిగిలిన సైన్స్ సబ్జెక్ట్‌ల్లోనూ విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో వర్సిటీ కూడా పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించడం లేదు. ఒక్కో సబ్జెక్టుకు 7 మంది చొప్పున మొత్తం 56 మంది ప్రొఫెసర్లు ఉండాల్సి ఉండగా, 24 మంది మాత్రమే ఉన్నారు. అందులో కూడా కేవలం ఆరుగురు మాత్రమే రెగ్యులర్ ఫ్యాకల్టీలు కావడం గమనార్హం. మిగిలిన వారు కాంట్రాక్ట్ బేసిక్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఫ్యాకల్టీలకు నెలకు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షలు జీతం ఉంటే, కాంట్రాక్ట్ బేసిక్‌పై పని చేసే వారికి రూ.35వేలు మాత్రమే అందజేస్తున్నారు. దీనివల్ల కూడా విద్యా ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయి.

విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులతోనే

విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు, అందుబాటులోకి వచ్చిన మెరుగైన ఉపాధి అవకాశాల వల్ల విద్యార్థులు ఆర్ట్స్ సబ్జెక్టులపై ఆసక్తి చూపడం లేదు. ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యపై మక్కువ చూపుతున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు కూడా ఆర్ట్స్ సబ్జెక్టుల్లో అడ్మిషన్లు తగ్గినమాట వాస్తవమే. విద్యార్థులు, తల్లిదండ్రుల అభిరుచులు, ఉపాధి అవకాశాలు, విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులతో కూడిన పరిణామాల ప్రభావం విద్యా సంస్థలపై ఉంటుంది.

–టీ వీరారెడ్డి, ప్రిన్సిపల్

క్లుప్తంగా

పూడికతో నిండిన డ్రైనేజీలు



వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులోని పలు వీధుల్లో డ్రైనేజీలు పూడికతో నిండాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో మురుగు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టి రోగాల బారిన పడకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కలిగిరి: స్థానిక వివేకానందనగర్‌లో త్రైత సిద్ధాంత–ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. సేవా సమితి సభ్యులు జీ ప్రసాద్, నరసింహులు, పెంచలరత్నం, మధుసూదన్‌రావు, కొండారెడ్డి, మాలకొండారెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో చోరీ

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో శనివారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. దర్గాలోని హుండీని అపహరించుకెళ్లారు. ఆదివారం ఉదయం దర్గా వద్దకు వెళ్లిన భక్తులు హుండీ లేకపోవడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలోని తుమ్మాలమ్మ ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీసీపుటేజ్‌లో దొంగల ఆనవాళ్లు కనిపించినప్పటికీ పోలీసులు పట్టుకోలేకపోయారు. ప్రస్తుతం దొంగలు ఏకంగా ప్రధాన రహదారిపై ఉన్న దర్గాలోని హుండీని మాయం చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆత్మీయ సమావేశం



మర్రిపాడు: మండలంలోని కదిరినాయుడుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ విధి విధానాలు, కార్యాచరణపై చర్చించారు. మండలాధ్యక్షుడు పాలా రవీంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి మైలి వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు మందా బ్రహ్మరెడ్డి, జిల్లా బాధ్యులు విజయరెడ్డి, రమేష్, ఏ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన 27 మంది బాధితులకు రూ.48 లక్షల విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. పార్టీ నాయకులు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, టీ గిరినాయుడు, కేశవచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం హనుమత్ సమేత సీతారామలక్ష్మణుల మూలవిరాట్టులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం 11 గంటలకు సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపారు. మధ్యాహ్నం దాత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు.

ప్రసన్నుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- బిలకూట క్షేత్రంలో మొదలైన వేడుకలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివస్తున్న భక్తులు

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి పంచవాహ్నిక బ్రహ్మోత్సవాలకు వైఖానస ఆగమోక్తంగా ఆదివారం రాత్రి అంకురార్పణ చేశారు. ఆలయ అర్చకబృందం విశ్వక్సేనుని పూజతో అంకురార్పణ కార్యక్రమం ప్రారంభించారు. తొలుత ఆలయ ఆవరణలోని పుట్టమట్టిని సేకరించి దానిపై పాలాభిషేకంతో చెమ్మగిల్లిన నవధాన్యాలను చల్లి మట్టితో కప్పారు. అనంతవిశ్వానికి, మానవ మనుగడకు ప్రకృతే ఆధారమని చాటే పరమార్థంతో అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. పుట్టమట్టిలో ఉంచిన నవధాన్యాలు సకాలంలో మొలకెత్తే విధంగా జిల్లేడు ఆకులను కప్పి ప్రత్యేక పూజలు చేశారు. అంకురార్పణ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం నుంచి మెట్లపూజలో పాల్గొన్న మహిళలు అంకుర్పాణ అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వర్ణవర్ణం సర్వశ్రేష్టం

బ్రహ్మోత్సవాల అంకురార్పణలో భాగంగా పుట్టమట్టితో కప్పిన నవధాన్యాలు మొలకెత్తే వర్ణం ఆధారంగా ఉత్సవాల శ్రేష్టత ఆధారపడి ఉంటుందని అర్చకులు తెలిపారు. అంకురార్పణలో ఉంచిన ధాన్యాలు స్వర్ణవర్ణంలో మొలకెత్తితే ఉత్సవాలు సర్వోత్తమంగానూ, శ్వేత వర్ణంలో మొలకెత్తితే మధ్యమంగానూ, చిత్రవర్ణంలో మొలకెత్తితే అధమంగానూ ఉంటాయని వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తిరుమంజనం, రాత్రికి ధ్వజారోహణ (కొడిముద్దలు), శేషవాహన సేవ, పూలంగిసేవ నిర్వహించనున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



సంగంలో ప్రతిభా పరీక్ష రాస్తున్న విద్యార్థులు



జలదంకిలో విజేతలకు బహుమతుల ప్రదానం

జలదంకి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఐదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. బీకే అగ్రహారానికి చెందిన బాలచంద్ర ప్రథమ, కమ్మవారిపాళేనికి చెందిన లిఖిత్ ద్వితీయ, చింతలపాళేనికి చెందిన భవ్యశ్రీ తృతీయ, ఎల్ఆర్ అగ్రహారానికి చెందిన మహానందు నాల్గో స్థానం, జమ్మపాళేనికి చెందిన నిఖిల్‌దేవ్ ఐదోస్థానంలో నిలిచారు. కృష్ణాపాడుకుచెందిన బీవీఎం గ్రూప్స్ అధినేత పాలవల్లి విజయ్‌బాస్కర్‌రెడ్డి సహకారంతో విజేతలకు వరుసగా రూ. 5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ. వేయి చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీధర్, నాగేశ్వరరావు, ఆపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు పీవీ రవికుమార్, జిల్లా అధ్యక్షుడు కేకే రాజగోపాల్, డివిజన్ కారద్యదర్శి టీ మాల్యాద్రి, జిల్లా కార్యదర్శులు రాధయ్య, ప్రభాకర్, వెంకటరెడ్డి, మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఐదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షను ఆదివారం నిర్వహించారు. సంఘ రాష్ట్ర నాయకులు చక్రపాణి, పలువురు హెచ్ఎంలు విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

యువత పోరు జయప్రదానికి పిలుపు

సీతారామపురం: విద్యార్థులు, నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ ఈ నెల 12న నెల్లూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

పక్కాగృహాలకు ధ్రువీకరణ పత్రాలు

సీతారామపురం/వరికుంటపాడు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్లను సోమవారం మధ్యాహ్నం రెండు గంటల్లోగా హౌసింగ్ కార్యాలయాల్లో అందజేయాలని ఆయా మండలాల హౌసింగ్ ఏఈలు కరిముల్లా, సయ్యద్‌పీరాన్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. ధ్రువీకరణ పత్రాలు అందజేసిన వారి జాబితాను మాత్రమే పక్కాగృహాల మంజూరుకు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

చింతగుంటకు నివాళి



చెన్నారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కాకాణి

సోమశిల: అనంతసాగరం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ చింతగుంట సుబ్బారెడ్డి తండ్రి చింతగుంట చెన్నారెడ్డి గత నెల 21న స్వర్గస్తులవగా సంతాప సభను ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరై చెన్నారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చింతగుంట కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం లింగంగుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేతా రాఘవరెడ్డిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల కాలు దెబ్బతినడంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో రాఘవరెడ్డి ఆరోగ్య పరిస్థితిని కాకాణి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, పార్టీ నాయకులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, బట్రెడ్డి జనార్దన్ రెడ్డి, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.



మంచు పరదా

కొండాపురం : మార్చి నుంచి ఎండలు మండుతున్నాయి. చెరువులు అడుగంటుతున్నాయి. అయినప్పటికీ మండలంలో ఆదివారం ఉదయం పొగమంచు దట్టంగా కురిసింది. ఉదయం 9గంటల వరకు మంచుతెరలు వీడలేదు. దీంతో రోడ్లపై ప్రయాణం చేసే వాహనచోదకులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అవస్థ పడ్డారు. ఉదయాన్నే పొలం పనులకు వెళ్లే వారు సైతం మంచుతొలగే వరకు ఆగారు.

ఉపాధి పనుల్లో అవినీతి తేలేనా?

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.8.35కోట్లతో పనులు
- గ్రామాల్లో తనిఖీలు చేపడుతున్న సామాజిక తనిఖీ బృందాలు
- 13న బహిరంగ ప్రజావేదిక



కూలీల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఆర్పీ

సీతారామపురం : మండలంలోని 14 పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.8,35,69,875 కోట్లతో ఉపాధి పనులను చేపట్టారు. ఈ పనులపై ఈ నెల 6వ తేదీ నుంచి సామాజిక తనిఖీలు చేపడుతున్నారు. ఎస్సార్పీ నీలకంఠ ఆధ్వర్యంలో 10 మంది డీఆర్పీలు సామాజిక తనిఖీ బృంద సభ్యులతో కలిసి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై జోరుగా తనిఖీలు చేపడుతున్నారు. గ్రామాల్లోని జాబ్‌కార్డులు కలిగిన కూలీల వద్దకు వెళ్లి ఎన్ని రోజులు పనులకు వెళ్లారు..ఎంత కూలి వచ్చింది..తదితర వివరాలను ఆరాతీసి నమోదు చేసుకుంటున్నారు. అంతేగాకుండా ఉపాధి నిధులతో చేపట్టి కాలువలు, జగనన్న కాలనీలు, ఇళ్లు, రోడ్లు, చెరువుకట్టల మరమ్మతు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి కొలతలు తీసి రికార్డుల్లోని వ్యత్యాసాలను గుర్తించి నమోదు చేస్తున్నారు. మండలంలోని 14 పంచాయతీల్లో చేపట్టిన 649 పనులను చేపట్టారు. ఆయా పనుల్లో క్షేత్ర సహాయకులు కూలీల పేరుతో దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఎంత మేర దోపిడీ చేశారనే విషయం బహిరంగ సభలో అధికారులు నిగ్గుతేల్చాల్సి ఉంది.

ఉదయగిరి జిల్లా సాధనకు ఉద్యమం ఉధృతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

ఉదయగిరి: జిల్లాలో వెనుకబడిన మెట్టప్రాంతమైన ఉదయగిరిని జిల్లా చేయాలని కోరుతూ చేపట్టిన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కే వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య ఐటీఐ కళాశాలలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిని రాజధాని చేయాలని రైతులు 1631 రోజులు ఉద్యమం చేసి విజయం సాధించారన్నారు. తాము కూడా ఉదయగిరిని జిల్లా చేయాలని 2,372 రోజులుగా ఉద్యమం చేస్తూనే ఉన్నామన్నారు. జిల్లా సాధన కోసం ర్యాలీలు, అవగాహన సదస్సులు, పోస్టుకార్డు ఉద్యమాలు, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఫలితంగా ఇటీవల ఉదయగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేసేందుకు పరిశీలన చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో ప్రకటించడం జిల్లా సాధన ఉద్యమానికి బలం చేకూర్చిందన్నారు. మంత్రి ప్రకటనను మొదటి విజయంగా భావిస్తున్నామన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపామన్నారు. అన్ని రంగాలలో వెనుకబడిన ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేయాలని అసెంబ్లీలో మీ వాణిని వినిపించాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. ఇక నుంచి పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, ప్రజాసంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఉద్యమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, ఖాదర్‌బాషా, జీ రామిరెడ్డి, ఫణిరాజ్, ఏడుకొండలు, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

చింతలదేవి ఎన్‌కేబీసీలో జేసీ విచారణ

- ఆవులకు బ్రూసెల్లోసిస్ వ్యాధిపై ఆరా
- పశువులు, జీవాల మృత్యువాతపై ఆగ్రహం
- జేడీపై ప్రశ్నల వర్షం



గేదెలను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

కొండాపురం : మండలంలోని చింతలదేవిలో ఉన్న నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్, మిశ్రమ పశుగణాభివృద్ధి క్షేత్రాన్ని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఆదివారం సందర్శించారు. క్షేత్రంలోని విదేశీ, దేశీయవాలీ గేదెలు, ఆవులు, గొర్రెలను పరిశీలించారు. ఎన్ని రకాల జాతులు ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఒంగోలు, పుంగనూరు పశువుల బ్రీడింగ్ అసోసియేషన్ మైదుకూరు జిల్లా అధ్యక్షుడు సీ కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్‌బీకేసీలోని అవకతవకలపై ఆ సంస్థ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఎన్‌కేబీసీలో విచారణ జరిపారు. ఆవులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి ఉందా..ఉంటే దాని నివారణకు వ్యాక్సిన్లు వేస్తున్నారా..లేదా..వ్యాక్సిన్ వేస్తే వ్యాధి ఎందుకు నయం కావడం లేదని వైద్యులను ప్రశ్నించారు. గతంలో ఈ వ్యాధితో చాలా రకాల ఆవులు చనిపోయినట్లు సమాచారం ఉందని..ఎందుకు అలా జరుగుతోంది.. మైదుకూరుకు చెందిన పాడి రైతులకు ఇక్కడి ఆవులకు వ్యాధి ఉందనే విషయం తెలిస్తే మీకు తెలియదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల క్షేత్రంలో 160 గొర్రెలు చనిపోయాయా అని డీడీ పెద్దిస్వామిని ప్రశ్నించారు. పశువులు ఎందుకు చనిపోయాయి..రెండు ఒంగోలు జాతి ఆవులను కసాయికి విక్రయించారా..70 ఆవులకు బ్రుసెల్లోసిస్ వ్యాధి వచ్చిందా.. పాల దిగుబడి శాతం ఎందుకు తగ్గింది.. బ్రీడింగ్ డెవలప్‌మెంట్ ఎందుకు జరగడం లేదని ఎన్‌కేబీసీ జేడీ వెంకటేష్‌పై జేసీ ప్రశ్నల వర్షం కురిపించారు. జేడీ,డీడీ, ముగ్గురు ఏడీలు, వైద్యులు, సిబ్బంది ఉంటే పశువులు ఎందుకు చనిపోతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పశువులు, జీవాల మృత్యువాతపై సమగ్ర నివేదికతో మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయానికి విచారణకు రావాలని ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిని కూడా రావాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పశువర్ధక శాఖ జేడీ శీనానాయక్, తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీఓ ఆదినారాయణ, సిబ్బంది ఉన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



చేజర్ల: ధ్యాన మాస్టర్‌కు సన్మానం

ఆత్మకూరు/చేజర్ల: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని హైదరాబాద్‌కు చెందిన కైలాసపురి కడ్తాల్ పిరమిడ్ ధ్యాన కేంద్రం ట్రస్టీ జేఈ నారాయణ పేర్కొన్నారు. ఆత్మకూరులోని షిర్డీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం, చేజర్ల మండలం పుల్లనీళ్లపల్లిలోని భగవాన్ వెంకయ్యస్వామి ధ్యానమందిరంలో ధ్యానంపై శిక్షణా తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన మాస్టర్ నారాయణ మాట్లాడుతూ ధ్యానంతో మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు. ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించుకున్న ఎందరో వారి అనుభవాలను చెబుతుండడంతో ప్రజల్లో ధ్యాన సాధనపై ఆసక్తి పెరుగుతోందన్నారు. చిన్న వయస్సు నుంచే పిల్లలు ధ్యానంపై అవగాహన పెంచుకుని క్రమం తప్పకుండా సాధన చేసేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. శాకాహారం మాత్రమే ఆరోగ్యానికి సంపూర్ణ రక్ష అన్నారు. షిర్డీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

కల్లూరి నియామకంపై హర్షం



కల్లూరి జనార్ధన్‌రెడ్డి

సీతారామపురం : వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మాజీ ఎంపీపీ కల్లూరి జనార్దన్‌రెడ్డిని నియమించడంపై ఆ పార్టీ మండల నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కాగా తనపై ఎంతో నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్లమెంట్ అధ్యక్షుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి కల్లూరి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.